ఎట్టకేలకు టీచర్ల సర్దుబాటు ఉత్తర్వులు

సంగారెడ్డి అర్బన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో ఎట్టకేలకు ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ పూర్తయింది. ఈ మేరకు మంగళవారం డీఈవో వెంకటేశ్వర్లు సర్దుబాటు ఉత్తర్వులు వెలువరించారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి జిల్లా వ్యాప్తంగా 349 మంది ఉపాధ్యాయులను విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అవసరమైన పాఠశాలలకు సర్దుబాటు చేశారు. సర్దుబాటు చేయబడిన టీచర్లు ఈ నెల 23న కేటాయింపబడిన పాఠశాలలో రిపోర్టు చేయాలని ఆదేశించారు.

అమ్మవారి కృపతో అభివృద్ధి పథంలో రాష్ట్రం

బీఆర్ఎస్ హయాంలో కుంటుపడిన అభివృద్ధి

కాంగ్రెస్ సంక్షేమ పథకాలు ఆదర్శంగా నిలుస్తున్నాయి

ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి



మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న మంత్రి గడ్డం వివేక్

చేగుంట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): అమ్మవారి కృపతో తెలంగాణ అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నదని ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఏర్కొన్నారు. చేగుంట మండల కేంద్రంలోని మహంకాళి పలహారం రథం కార్యక్రమంలో మంగళవారం రాత్రి ఆయన పాల్గొన్నారు. అంతకుముందు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో దూసుకుపోతోందని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, దుబ్బాక, నర్సాపూర్ నియోజకవర్గాల పార్టీ ఇన్‌చార్జిలు శ్రీనివాస్‌రెడ్డి, ఆవుల రాజిరెడ్డి, నాయకులు నవీన్, కురుమ లక్ష్మి, వెంగల్‌రావు, సంద్రు శ్రీకాంత్, రాజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గౌడ కులస్థుల బోనాల జాతరలో జగ్గారెడ్డి, నిర్మల



సంగారెడ్డిలో గౌడ కులస్థుల బోనాల జాతరలో పాల్గొన్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి



సంగారెడ్డిలో నిర్వహించిన గౌడ కులస్థుల బోనాల జాతరలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

సంగారెడ్డి రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం సందర్భంగా సంగారెడ్డి పట్టణంలో గౌడ కులస్థుల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన బోనాల జాతర అంగరంగ వైభవంగా జరిగింది. ఈ ఉత్సవంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా సంగారెడ్డి పట్టణంలో మహిళలు బోనాలతో అస్తబల్ వరకు ఊరేగింపుగా వెళ్లి రేణుకా ఎల్లమ్మ తల్లికి బోనాలు, నైవేద్యాలు సమర్పించారు. జాతరలో పోతరాజులు, శివసత్తువుల విన్యాసాలు, కళాకారుల ఆటపాటలు, భవిష్యవాణిలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గౌడ కులస్థుల ఆరాధ్య దైవమైన రేణుకా ఎల్లమ్మ తల్లి వేషధారణతో కళాకారుల నృత్యాలు పలువురిని అలరించాయి. పలహారం బండి ఊరేగింపు కనువిందుగా సాగింది. ప్రతీ సంవత్సరం ఆషాఢ మాసంలో గౌడ కులస్థులు పెద్దఎత్తున ఎల్లమ్మకు బోనాలు ఊరేగింపు ఉత్సవాలు నిర్వహించడం వారి ఐక్యతను చాటిచెబుతుందని జగ్గారెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో అన్ని కుల సంఘాల ఆధ్వర్యంలో నెల రోజుల పాటు ఆషాఢ మాసం బోనాలతో సంగారెడ్డిలో సందడి నెలకొంది. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కూన సంతోష్ కుమార్, కిరణ్‌గౌడ్, గౌడ సంఘం నాయకులు నక్క నాగరాజుగౌడ్, ప్రభుగౌడ్, ఆర్.శ్రీనివాస్‌గౌడ్, శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి జిల్లాలో ఎస్ఐల బదిలీ

సంగారెడ్డి క్రైం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో 23 మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ పరితోష్ పంకజ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారంతా వెంటనే కొత్త స్థానాల్లో విధుల్లో చేరాలని ఆదేశించారు.

తూప్రాన్ పట్టణంలో శునకాల తరలింపు



శునకాలను బంధిస్తున్న బ్లూక్రాస్ సిబ్బంది

తూప్రాన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): చిన్నారులు, ప్రజలపై కుక్కల దాడుల నేపథ్యంలో తూప్రాన్ పట్టణంలో చర్యలు చేపట్టారు. బ్లూక్రాస్ సంస్థ సహకారంతో వీధి కుక్కలను బంధించారు. తూప్రాన్ పట్టణంలో ఆదివారం ఊర కుక్కల దాడిలో పట్టణానికి చెందిన అనిరుథ్ (3) తీవ్రంగా.. 10 మంది స్వల్పంగా గాయపడ్డారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేశ్‌రెడ్డి హైదరాబాద్‌లోని బ్లూక్రాస్ సంస్థను సంప్రదించారు. బ్లూక్రాస్ సంస్థ సిబ్బంది మంగళవారం రెండు వాహనాల్లో వచ్చి 50 శునకాలను బంధించి హైదరాబాద్‌కు తరలించారు. జనన నియంత్రణ శస్త్ర చికిత్సల అనంతరం తిరిగి పట్టణానికి తీసుకువచ్చి వదలనున్నారు.

'వడ్డీ'కాసురులు

అడ్డూ అదుపు లేని ఫైనాన్స్ దందా



ఫైనాన్స్ మాఫియా బెదిరింపులు, అధిక వడ్డీల వేధింపులతో రుణగ్రహీతలు ప్రాణాలు కోల్పోతున్నారు. ఇటీవల మెదక్‌లో సాయిదీప్ సూపర్ మార్కెట్ యజమాని, ఉపాధ్యాయుడి ఆత్మహత్యలు ప్రైవేటు వడ్డీ వ్యాపారుల అరాచకాలకు అద్దం పడుతున్నాయి. ఈ దారుణ ఘటనలు ఫైనాన్స్ మాఫియా పంజా విసురుతున్న తీరును, బాధితులు అనుభవిస్తున్న నరకయాతనను వెలుగులోకి తెచ్చాయి.

అప్పుల ఊబిలో సామాన్యులు

డబ్బున్నవారికీ తప్పని వేధింపులు

కట్టలేక బలవన్మరణాలు

జిల్లాలో పెరుగుతున్న అఘాయిత్యాలు

మెదక్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రుణాల పేరుతో అప్పులు ఇచ్చి అడ్డగోలు వడ్డీలు.. దౌర్జన్యాలతో సామాన్యుల ప్రాణాలు తోడేస్తున్నారు ప్రైవేటు ఫైనాన్స్ మాఫియా. వడ్డీల ఊబిలో కూరుకుపోయి.. తీర్చలేక పడిన మానసిక వేదన, అవమానాలు, బెదిరింపులు తట్టుకోలేక మెదక్‌లో ఇటీవల చోటుచేసుకున్న వరుస ఆత్మహత్యలు ఈ దారుణమైన వాస్తవాన్ని కళ్లకు కట్టాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ నష్టపోయిన ఉపాధ్యాయుడు కాముని రమేష్, సాయిదీప్ సూపర్ మార్కెట్ యజమాని రమేష్.. ఇలా ఒకరి తర్వాత ఒకరు ప్రాణాలు తీసుకోవడం జిల్లాలో ఆందోళనను నింపింది. బ్యాంకుల మాదిరిగానే తమ సొంత నిబంధనలతో చట్టవిరుద్ధంగా రుణాలు ఇస్తూ, ఆస్తులను తమ పేరిట రిజిస్ట్రేషన్ చేసుకుంటూ, ఖాళీ చెక్కులతో బెదిరింపులకు పాల్పడుతున్న ఈ వడ్డీ వ్యాపారుల అరాచకాలు హద్దుమీరుతున్నాయి. ప్రజల ప్రాణాలను బలిగొంటున్న ఈ ఫైనాన్స్ మాఫియా ఆట కట్టించడానికి ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని, బాధితులకు న్యాయ, మానసిక మద్దతు అందించాలని సర్వత్రా డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. ఈ వరుస బలవన్మరణాలు అప్పుల బాధ, ఆత్మస్థైర్యం కోల్పోయి నిస్సహాయ స్థితిలో ఉన్న వ్యక్తుల భయంకరమైన మానసిక యాతనను కళ్లముందు నిలుపుతున్నాయి.

వడ్డీ చెల్లించకపోతే అవమానాలు

జాతీయ బ్యాంకులు, ప్రభుత్వం గుర్తించిన బ్యాంకుల్లో వడ్డీ రూపాయికి మించదు. ప్రైవేటు వడ్డీ వ్యాపారులు మాత్రం అవసరాన్ని బట్టి రెండ్రూపాయల నుంచి ఐదు రూపాయాల వరకు వసూలు చేస్తున్నారు. అప్పు ఇప్పించిన మధ్యవర్తికి కమీషన్ కూడా ఇవ్వాల్సి ఉంటుంది. అప్పు తీసుకున్న రోజున పార్టీ పేరిట మరికొంత ఖర్చవుతోంది. కొన్నిసార్లు ఖాళీ చెక్కులను గ్యారెంటీగా తీసుకుంటే.. పెద్ద మొత్తాలకు ఆస్తులను కూడా రిజిస్టర్ చేసుకుంటున్నారు. ఒక్క నెల వడ్డీ చెల్లించలేకపోతే కుటుంబ సభ్యుల ఎదుటనే

మిగతా 8వ పేజీలో

మెదక్ పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు కాముని రమేష్ (54) అదనపు ఆదాయం కోసం రియల్‌ఎస్టేట్ వ్యాపారంలోకి అడుగుపెట్టాడు. పలువురు వడ్డీ వ్యాపారుల వద్ద ఖాళీ చెక్కులు తనఖా పెట్టి రుణాలు తీసుకుని స్థలాలు కొనుగోలు చేశాడు. రియల్‌ఎస్టేట్ మార్కెట్ పతనం కావడంతో స్థలాలను అమ్ముకోలేకపోయాడు. దీంతో అప్పులకు వడ్డీలు పెరిగిపోయాయి. కొందరికి వడ్డీలు చెల్లించాడు. కానీ, కొందరు చెక్‌బౌన్స్ కేసులు వేశారు. కేసుల భారం, నిత్యం కోర్టుల చుట్టూ తిరిగి విసిగిపోయి మేడ్చల్‌లోని ఓ లాడ్జిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు ముందు తీసుకున్న సెల్ఫీ వీడియోలో అప్పులవాళ్ల వేధింపులను గురించి వివరించాడు. ఇల్లు, ఆస్తులను అమ్మి అప్పులు తీర్చినా ప్రామిసరీ నోట్లు, చెక్‌లు అడ్డుగా పెట్టుకుని తనను, తన కుటుంబాన్ని వేధించారని ఆరోపించారు.

మెదక్ పట్టణంలోనే ప్రతిష్టాత్మకంగా నిర్మించిన సాయిదీప్ స్టోర్స్ యజమాని రమేష్ ఆరు నెలల క్రితం షాపులోనే ఉరేసుకున్నాడు. వ్యాపార లావాదేవీల నిమిత్తం కోట్లాది రూపాయలు అప్పు తీసుకున్నాడు. ఆస్తులను బ్యాంకులకు మార్టిగేజ్ చేశాడు. అప్పులు ఇచ్చినవారు ఒత్తిడి చేయడంతో తీర్చే మార్గం లేక ప్రాణం తీసుకున్నాడు. ...వీళ్లే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో షావుకార్ల వద్ద అప్పు తీసుకునే రైతులు, డెయిలీ ఫైనాన్స్ తీసుకునే చిరు వ్యాపారులు, అవసరాలకు అప్పు తీసుకునే సామాన్యులు.. వడ్డీల భారం మోయలేక ప్రాణాలు తీసుకుంటున్నారు.

ఇందిరమ్మ.. కట్టుకోలేమమ్మా..!

భారంగా మారిన ధరలు



'డబుల్' ఇళ్లకు రంగులు

లబ్ధిదారులకు కేటాయించేనా?

పదేళ్లుగా ఎదురుచూపులు

మద్యం మత్తు.. అతి వేగం.. ఇద్దరి ప్రాణాలు తీసింది

నిందితుడి అరెస్ట్

రహదారిపై హత్య

తండ్రి మందలించడంతో యువకుడి ఆత్మహత్య

వార్తలు 6వ పేజీలో

ఎన్నేళ్లకో..



రేషన్ కార్డుల పంపిణీకి ముహూర్తం

ఈ నెల 25 నుంచి మండలాల వారీగా పంపిణీ

నేడు ముందస్తుగా నారాయణఖేడ్, అందోల్ నియోజకవర్గాల్లో శ్రీకారం

మెదక్/సంగారెడ్డి అర్బన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్‌కార్డుల పంపిణీకి ముహూర్తం ఖరారైంది. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 14న రేషన్‌కార్డుల పంపిణీని అధికారికంగా ప్రారంభించారు. జిల్లాల్లో ఈ నెల 25 నుంచి ఆగస్టు 10 వరకు రేషన్‌కార్డులను పంపిణీ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో ఆదేశించారు. సీఎం ఆదేశాలమేరకు ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో, జిల్లా ఇన్‌చార్జి మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేయనున్నారు. ఈమేరకు పౌరసరఫరాలశాఖ కార్యాచరణ రూపొందించింది. గత ప్రభుత్వ హయాంలో 2019, 2021లో కొత్తగా రేషన్‌కార్డులు జారీ చేశారు. గత ఐదేళ్లలో కొత్తగా ఒక్క కార్డు కూడా మంజూరు చేయలేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం మీసేవా కేంద్రాల ద్వారా దరఖాస్తులు స్వీకరించి కొత్త కార్డులు మంజూరు చేయడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సంగారెడ్డి జిల్లాలో 15,543 కార్డులు

సంగారెడ్డి జిల్లాలో కొత్తగా 15,543 రేషన్ కార్డులు మంజూరయ్యాయి. జిల్లాలో ఆహార భద్రత కార్డుల కోసం మీ సేవా కేంద్రాల్లో 39,659 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 15,543 కొత్త రేషన్‌కార్డులకు ఆమోదం తెలిపారు. ఈ కార్డుల పరిధిలో 48,960 మంది కుటుంబ సభ్యులు ఉన్నారు. ఇవేకాకుండా కొత్తవారి పేర్లు చేర్చేందుకు 78,119 దరఖాస్తులు అందగా 59,289 దరఖాస్తులకు ఆమోదం లభించింది. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, తహసీల్దార్ క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులను గుర్తించి ఆమోదం కోసం జిల్లా పౌరసరఫరాల అధికారి లాగిన్‌కు పంపించారు. జిల్లా అధికారుల ఆమోదంతో రేషన్ కార్డుల మంజూరుకు మోక్షం లభించింది. ముందస్తుగా నేడు నారాయణఖేడ్, అందోల్ నియోజకవర్గాల్లో కొత్త రేషన్‌కార్డుల పంపిణీని ప్రారంభించనున్నారు. జిల్లాలో 846 రేషన్ దుకాణాల పరిధిలో ఇప్పటికే 3,78,511 ఉన్నాయి.

మెదక్ జిల్లాలో 9,864

మెదక్ జిల్లాలో కొత్తగా 9,864 రేషన్ కార్డులు మంజూరయ్యాయి. ఇప్పటికే ఉన్న కార్డుల్లో పేర్లు చేర్చడం కోసం 34,730 కార్డుదారులు దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలో 2,16,000 రేషన్ కార్డులు ఉన్నాయి. 7,31,890 లబ్ధిదారులకు 520 రేషన్ దుకాణాల ద్వారా 4,368 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నారు.

కార్డుల పంపిణీకి పటిష్ట ప్రణాళిక

మెదక్ అర్బన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో మంజూరైన కొత్త రేషన్ కార్డుల మంజూరుకు పక్కా ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన రేషన్‌కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, భూ భారతి, రెసిడెన్షియల్ హాస్టళ్లు, మహాలక్ష్మి పథకం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్త కార్డుల పంపిణీని 15 రోజుల్లో పూర్తి చేయాలని నిర్దేశించారు. ఇందిరమ్మఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలని సూచించారు. వసతి గృహాలు, గురుకులాల్లో విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని, దవాఖానాల్లో అన్ని మందులను అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని కేటాయించిన మిల్లులు సీఎంఆర్ డెలివరీ ఈ నెల 27 లోపు పూర్తిచేసేలా పౌరసరఫరాలశాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నిన్న వెలవెల.. నేడు కళకళ

ఒక్క రోజులో ఎంత తేడా.. సోమవారం రాత్రి వరకు చుక్క నీరు లేక వెలవెలబోయిన వాగు మంగళవారం తెల్లవారుజాము నుంచి పొంగిపొర్లుతోంది. ప్రతీ సంవత్సరం ఈ సమయంలో నీటితో నిండుగా ఉండే వాగు ఈసారి వానాకాలం వచ్చి నెలన్నర కావస్తున్నా బోసిపోయింది. కల్హేర్ మండలంలో ప్రవహించే మహారాజ్ వాగులోకి ఎగువన కంగ్టి, కామారెడ్డి జిల్లాలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు ఒక్కసారిగా ప్రవాహం వచ్చింది. వరి నాట్లపై ఆశలు వదులుకున్న రైతులకు ఊరట లభించింది.

-కల్హేర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి)





ఇక.. స్మార్ట్ సంగారెడ్డి

రూ. 8 కోట్లతో 38 వార్డుల్లో నిఘా నేత్రాలు

200 ప్రదేశాల్లో 500 సీసీ కెమెరాలు

కమాండ్ కంట్రోల్ నుంచి నిరంతర పర్యవేక్షణ

చైన్ స్నాచింగ్‌లు, చోరీలు, నేరాలకు చెక్



సంగారెడ్డిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

సంగారెడ్డి క్రైం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన సంగారెడ్డి ఇక నుంచి స్మార్ట్ సిటీగా మారనుంది. పట్టణంలోని 38 వార్డుల్లో నిరంతర నిఘా కొనసాగనుంది. పట్టణంలోని 38 వార్డుల్లో స్మార్ట్‌సిటీ పథకంలో భాగంగా హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో రూ.8 కోట్లతో 500 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు పోలీసుశాఖ చర్యలు తీసుకుంటోంది. పట్టణంలో 200 చోట్ల 360 డిగ్రీలు నిఘా ఉంచగలిగే హై రెసెల్యూషన్ కెమెరాలు బిగిస్తున్నారు. ఎక్కడ ఏ సమస్య వచ్చినా పోలీసులు క్షణంలో చేరుకొనే అవకాశం ఉంటుంది.

చైన్‌స్నాచింగ్‌లు, చోరీలకు చెక్

సంగారెడ్డి పట్టణంలో నేరాల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. చోరీలు, చైన్‌స్నాచింగ్‌లు, ఆకతాయిల వేధింపులు నిత్యకృత్యంగా మారాయి. కేసుల ఛేదన పోలీసులకు సవాలుగా మారుతోంది. ప్రస్తుతం ఏర్పాటు చేస్తున్న సీసీ కెమెరాలు అందుబాటులోకి వస్తే పట్టణంలో చీమ చిటుక్కుమన్నా పోలీసులకు తెలిసిపోతుంది. దీంతో చైన్ స్నాచింగ్‌లు, దొంగతనాలకు చెక్ పడే అవకాశముంది. సంగారెడ్డి పట్టణం మొత్తాన్ని పోలీసుల నిఘాలోకి తీసుకురావడం కోసమే సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ పేర్కొన్నారు. నెల రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తవుతుందని తెలిపారు. కమాండ్ కంట్రోల్ నుంచి నిరంతరం సీసీ కెమెరాల పర్యవేక్షణ కొనసాగుతుందన్నారు.

ఆంధ్రజ్యోతి

ద్వారా మిమ్ములను అభిమానించే వారికి, శ్రేయోభిలాషులకు, మిత్రులకు శుభాకాంక్షలు తెలియజేయండి

ADVERTISEMENTS

జన్మదిన వేడుకలు

విదేశీయాన శుభాకాంక్షలు

ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు

వివాహ శుభాకాంక్షలు

స్వదేశాగమన శుభాకాంక్షలు

మొదలగు అన్ని రకముల పత్రికా ప్రకటనకు మీ ఏరియాలోని మా ప్రతినిధిని సంప్రదించండి.

ప్రతి ప్రకటనపై GST 5% వర్తిస్తుంది.

సంగారెడ్డి / పటాన్‌చెరు :99516 09964

నారాయణఖేడ్ / జహీరాబాద్ :97030 18478

మెదక్ / నర్సాపూర్ :97030 18476

సిద్దిపేట / గజ్వేల్ :99485 05054

'డబుల్' ఇళ్లకు రంగులు

● లబ్ధిదారులకు కేటాయించేనా?

● పదేళ్లుగా ఎదురుచూపులు


నర్సాపూర్‌లో డబుల్‌బెడ్ రూం ఇళ్లకు రంగులు వేసిన దృశ్యం

నర్సాపూర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పేదల డబుల్ ఇళ్ల ఆశలు మళ్లీ చిగురిస్తున్నాయి. నియోజకవర్గ కేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లకు రంగులు కూడా వేస్తుండటంతో ఇక లబ్ధిదారులను ఎంపిక చేసి, కేటాయించడమే తరువాయి అని ఆశపడుతున్నారు. నిర్మాణం పూర్తి చేసుకున్న డబుల్ బెడ్ రూం ఇళ్లను ఇప్పటికైనా కేటాయించాలని వారంతా కోరుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో నర్సాపూర్-వెల్దుర్తి మార్గంలో 2016 ఐదు వందల డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఇందులో సుమారు 250 ఇళ్ల నిర్మాణాలు చివరి దశలో ఉండగా, 250 ఇళ్లు అసంపూర్తిగా ఉన్నాయి. చివరి దశలో ఉన్న 250 ఇళ్లకు ప్రస్తుతం అధికారులు రంగులు కూడా వేస్తున్నారు.

ఇంటి స్థలం లేని వారికి..

గత ప్రభుత్వ హాయంలో ఇళ్లు లేని వారి కోసం డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించినా.. లబ్ధిదారులకు కేటాయించలేదు. ప్రస్తుత ప్రభుత్వం ఇళ్లలేని పేదల కోసం ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భూమి ఉన్న వారి మొదటి విడతలో ఇళ్లను మంజూరు చేసింది. ఇక స్థలం లేని వారికి డబుల్ బెడ్ రూం ఇళ్లలో అవకాశం కల్పిస్తామంటూ అధికార పార్టీ నాయకులు హామీలు ఇస్తుండటంతో ఇప్పుడు పూర్తి చేస్తున్న డబుల్ బెడ్‌రూం ఇళ్లు పాత దరఖాస్తుల ప్రకారం లబ్ధిదారులను ఎంపిక చేస్తారా? లేక ఇందిరమ్మ పథకం కింద స్థలాలు లేని వారికి కేటాయిస్తారా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

లబ్ధిదారుల ఎంపిక కత్తిమీద సామే..

పట్టణంలో డబుల్‌బెడ్ రూము ఇళ్ల కోసం లబ్ధిదారుల ఎంపిక అధికారులకు కత్తిమీద సాములా మారనుంది. ఇక్కడ 500 ఇళ్లను నిర్మించాలని భావించగా, ప్రస్తుతం 250 ఇళ్లు పూర్తి కావొచ్చాయి. ఈ ఇళ్ల కోసం సుమారు 3 వేలకుపైగా దరఖాస్తులు వచ్చాయి. ఇందులో అసలైన అర్హులను ఎంపిక చేయాల్సి ఉంటుంది. దరఖాస్తుదారులు ఎక్కువగా ఉండటం, ఇళ్లు తక్కువగా ఉండటం అధికారులకు లబ్ధిదారుల ఎంపిక సవాల్‌గా మారనుంది. మరి పూర్తి అయిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

క్రైం కార్నర్


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ కృష్ణ, హతుడు సబిల్(ఫైల్)

జాతీయ రహదారిపై హత్య

శివంపేట, జూలై 22(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి-తూప్రాన్ జాతీయ రహదారికి అతి సమీపంలో ఓ వ్యక్తిని గుర్తు తెలియని దుండగులు ముఖంపై బండరాయితో మోది హత్య చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మెదక్ జిల్లా శివంపేట మండలం మగ్దుంపూర్ శివారులో మంగళవారం ఓ యువకుడిని దుండగులు ముఖం మీద బండతో కొట్టి చంపి బట్టలు లేకుండా నగ్నంగా పడేశారు. ఘటనా స్థలాన్ని తూప్రాన్ సీఐ రంగకృష్ణ సిబ్బందితో కలిసి పరిశీలించి జాగిలంతో తనిఖీలు నిర్వహించి విచారణ చేపట్టారు. మృతుడు హైదరాబాద్‌లోని బోరబండకు చెందిన మహ్మద్ సబిల్(21)గా పోలీసులు గుర్తించారు. ఘటనా స్థలంలో 2 వెండి చైన్లు, సిల్వర్ కలర్ వాచ్ ఉన్నాయని సీఐ రంగకృష్ణ తెలిపారు.

మద్యం మత్తు.. అతి వేగం.. ఇద్దరి ప్రాణాలు తీసింది

● నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్

సిద్దిపేట అర్బన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తు, అతి వేగం ఇద్దరి ప్రాణాలు తీసింది. రోడ్డు ప్రమాదంలో తండ్రీకుమార్తెల మరణానికి కారణమైన నిందితుడిని మంగళవారం త్రీ టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ విద్యాసాగర్ వారి వివరాలను వెల్లడించారు. ఈ నెల 21న సిద్దిపేట అర్బన్ మండలం రంగధాంపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సంతోష్ కుమార్ (26) అతని కుమార్తె ఝాన్సీ (4) మృతి చెందిన విషయం తెలిసిందే. మిట్టపల్లి గ్రామానికి చెందిన కొమ్మిశెట్టి మణిసాయి, సిద్దిపేట పట్టణం సుభాష్‌నగర్‌కు చెందిన సామలేటి పవన్ కుమార్‌లు కారులో మేడ్చల్ వెళ్లి తిరిగి వస్తూ మార్గమధ్యంలో ఓ వైన్స్ వద్ద మద్యం తాగారు. అక్కడి నుంచి రంగధాంపల్లి సమీపంలోని వైన్స్ వద్ద కూడా మద్యం తాగారు. రెండవసారి మద్యం తాగిన తర్వాత పవన్ కుమార్‌ని సిద్దిపేటలో దింపిన కొమ్మిశెట్టి మణిసాయి, మిట్టపల్లి గ్రామానికి వస్తుండగా, కారు అజాగ్రత్తగా, అతివేగంగా నడుపుతూ సంతోష్‌కుమార్, ఝాన్సీలు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టాడు. దీంతో ఇద్దరూ చనిపోయారు. ఈ కేసులో నిందితుడిని అదుపులోకి తీసుకుని, రిమాండ్ కోసం కోర్టు ఎదుట హాజరుపరిచారు.

తండ్రి మందలించాడని యువకుడి ఆత్మహత్య


శ్రీనివాస్ (ఫైల్)

తూప్రాన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులున్నాయి, వ్యవసాయ పనులు మంచిగా చేసుకో అని తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురైన యువకుడు పురుగుల మందు సేవించి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటన తూప్రాన్ మండలం నాగులపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. తూప్రాన్ ఎస్ఐ శివానందం కథనం ప్రకారం, నాగులపల్లికి చెందిన ఏశబోయిన ఎల్లంకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. చిన్న కుమారుడు ఏశబోయిన శ్రీనివాస్ (30)ను ఆర్థిక ఇబ్బందులున్నాయని, వ్యవసాయ పనులు బాగా చేసుకోవాలని తండ్రి మందలించాడు. ఈ విషయంలో మనస్తాపానికి గురైన శ్రీనివాస్ ఈనెల 19న ఇంట్లో వాళ్లు బయటకు రాకుండా గడియపెట్టి ఇంటి పైకి వెళ్లి పురుగుల మందు సేవించాడు. కుటుంబీకులు కేకలు వేయడంతో చుట్టుపక్కల కుటుంబాల వారు వచ్చి తలుపు గడియ తీయడంతో పురుగుల మందు సేవించిన శ్రీనివాస్‌ను హైదరాబాద్‌లోని నారాయణ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. తండ్రి ఎల్లం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందం వివరించారు.


ఈనెల 25న బ్రహ్మాండమైన విడుదల



దేవి 70 ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్
ఎ.ఎం.బి సినిమాస్ - గచ్చిబౌలి
పీవీఆర్ సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట
మరియు మీ అభిమాన థియేటర్లలో

GEETHA FILM DISTRIBUTORS



ఇందిరమ్మ.. కట్టుకోలేమమ్మా..!

● భారంగా మారిన ధరలు

జహీరాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): 'రాక. రాక ఇల్లు మంజూరైంది.. కట్టుకోకపోతే రద్దవుతది.. కట్టుకుందామంటే ధరలు మండుతున్నాయి.' ఇది ఇందిరమ్మ లబ్ధిదారుల ఆందోళన. సొంతింటి కలను నిజం చేసుకోవాలనుకున్న పేదలకు పెరుగుతున్న ధరలు అడ్డంకిగా మారుతున్నాయి. ప్రభుత్వం పెద్ద మనసుతో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయగా, వాటిని కట్టుకునేందుకు ముందుకు వచ్చిన లబ్ధిదారులు పెరిగిన ముడిసరుకుల ధరలు చూసి దిక్కుతోచకున్నారు. ఇటు ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభం కాగానే, అటు వ్యాపారులు ముడిసరుకుల ధరలు పెంచడంతో ఇల్లు కట్టడం ఎలా అని ఆందోళన చెందుతున్నారు.

స్టీల్ క్వింటా 5,500

ఇంటి నిర్మాణానికి అవసరమైన అన్ని వస్తువుల ధరలు పెరిగిపోయాయి. జిల్లాలో స్టీల్ క్వింటా రూ. 5,500 పలుకుతోంది. సిమెంట్ బస్తా రూ.350 నుంచి రూ.380 వరకు అమ్ముతున్నారు. ఇసుక టన్ను రూ. 2,500 నుంచి రూ.3,500 వరకు పెట్టాల్సి వస్తోంది. ఎర్రరాతి ఒకటి రూ. 25, ఇటుక రూ. 9 చొప్పున దొరుకుతుంది. ఇప్పటికే స్కూల్ ఫీజులకు, వ్యవసాయ సీజన్‌లో పెట్టుబడులకు అప్పులు చేసిన వారు ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి మరింత అప్పు ఎక్కడ చేయాలో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. ప్రభుత్వం ఇస్తున్న రూ. 5 లక్షలు సరిపోవని అంటున్నారు.

నియోజకవర్గానికి 3400 ఇళ్లు

జహీరాబాద్ నియోజకవర్గానికి 3,400 ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో 1,516 ఇళ్లకు మార్కింగ్ చేయగా, 142 బేస్‌మెంట్ స్థాయిలో ఉన్నాయి. 15 ఇళ్లు రూఫ్ లెవల్‌లో.. మూడు స్లాబ్ స్థాయిలో ఉన్నాయి. సుమారు 86 ఇళ్లకు వివిధ దశలో నిధులు కూడా విడుదల చేసినట్లు గృహనిర్మాణశాఖ డీఈఈ అంజయ్య తెలిపారు.

స్నేహితుడి పుట్టిన రోజుకు వచ్చి.. మృత్యు ఒడికి

● కొండపోచమ్మ రిజర్వాయర్‌లో పడి ఒకరి మృతి


సాయి కృష్ణ(ఫైల్)

మర్కుక్/ములుగు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): స్నేహితుడి పుట్టిన సందర్భంగా సరదాగా గడిపేందుకు జలాశయానికి వచ్చిన ఆరుగురిలో ఒకరు నీట మునిగి చనిపోయారు. సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం కొండపోచమ్మ జలాశయం వద్ద మంగళవారం జరిగిన ఈ ఘటన వివరాలు.. రంగారెడ్డి జిల్లా లింగంపల్లి మండలం చందానగర్ కాలనీకి చెందిన వెంకటేశం(23), సాయిప్రసాద్(24), ప్రణయ్‌కుమార్ (25), మహేష్ (22), సాయికృష్ణ (23), నవీన్(22)లు తమ స్నేహితుడు ప్రణయ్‌కుమార్ పుట్టినరోజు సందర్భంగా సరదాగా గడపడానికి కొండపోచమ్మ జలాశయం దగ్గరికి కారులో వచ్చారు. జలాశయం పైకి వెళ్లడానికి పోలీసులు అనుమతి నిరాకరించడంతో కారును కిందనే పార్క్ చేసి నడుచుకుంటూ జలాశయం పైకి వెళ్లారు. ఈత కొడుదామని వీరంతా నీటిలోకి దిగారు. ఇందులో సాయికృష్ణ అనే యువకుడు జలాశయంలోని ఎక్స్‌కవేటర్ గుంతలో పడిపోయాడు. లోతు ఎక్కువగా ఉండటంతో స్నేహితులు అతడిని కాపాడలేకపోయారు. డయల్ 100కు ఫోన్ చేయగా, గౌరారం రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, మర్కుక్ ఎస్సై దామోదర్, ములుగు ఎస్సై విజయ్‌కుమార్ పోలీస్ బృందం వచ్చి గాలింపు చర్యలు చేపట్టింది. ఎంతకూ సాయికృష్ణ ఆచూకీ దొరకకపోవడంతో గజ ఈతగాళ్లను రప్పించగా, సుమారు నాలుగు గంటల తర్వాత మృతదేహం లభ్యమైంది. ఐదుగురు కలిసి వచ్చి అందులో ఒకరు మృత్యువాత పడటంతో ఆ స్నేహితులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఇక పుట్టిన రోజు జరుపుకున్న ప్రణయ్‌కుమార్ రోదిస్తూ 'నా స్నేహితుడు సాయికృష్ణ మరణం కోలుకోలేని ఘటన అని, ఇక నా జీవితంలో మళ్లీ పుట్టిన రోజు వేడుకలు ఎప్పటికీ జరుపుకోను' అంటూ రోదించాడు. ఈ సందర్భంగా గౌరారం రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ కొండపోచమ్మ జలాశయం పైకి వెళ్లేందుకు అనుమతులు లేవని అన్నారు.

మెదక్‌లో మూడు దుకాణాలు దగ్ధం

● రూ. 3 లక్షల ఆస్తినష్టం



దగ్ధమైన దుకాణాలు

మెదక్ అర్బన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మెదక్ పట్టణంలో అర్ధరాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో మూడు దుకాణాలు దగ్ధమయ్యాయి. బాధితుల వివరాల ప్రకారం, పట్టణంలో అంజనేయులు, నరేష్, నర్సింహులు కిరాణం, పండ్లు, సెలూన్ షాపులు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం సంభవించి వీరి దుకాణాలు పూర్తిగా కాలిపోయాయి. స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించగా, ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో దుకాణాల్లోని కిరాణ సామాగ్రి, పండ్లు, యంత్రాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. దాదాపు రూ.3లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు. ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమని నిర్ధారించారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు విజ్ఞప్తి చేశారు.

కుక్కదాడిలో వృద్ధురాలికి గాయాలు



అక్కన్నపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌటపల్లి గ్రామంలో మంగళవారం వీధి కుక్క దాడిలో ఓ వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. గ్రామానికి చెందిన భూంపల్లి అనసూర్య కిరాణా దుకాణానికి వెళ్తుండగా, వీధి కుక్క ఒక్కసారిగా వచ్చి దాడి చేసింది. దీంతో ఆమె చేతికి గాయమైంది. అక్కడి వారు ఆమెను హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి


మృతి చెందిన ఆవు వద్ద రోదిస్తున్న రైతు

కల్హేర్/సిర్గాపూర్, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సిర్గాపూర్ శివారులో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో ఒక ఆవు మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామానికి చెందిన చాకలి సాయిలు తన పాడి ఆవును గ్రామ శివారులో మేపుతుండగా, ఆవు మేత మేసుకుంటూ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్తింగ్ తీగ తగిలి అక్కడికక్కడే మృత్యువాత పడింది. రూ. 80 వేల విలువ గల పాడి ఆవుపై ఉన్న మమకారంతో రైతు సాయిలు ఆవు మీద పడి రోదించడం అక్కడి వారిని కలిచివేసింది. బాధితుడు సాయిలును ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

క్రైం కార్నర్

అదృశ్యమైన వృద్ధురాలి మృతదేహం లభ్యం

జిన్నారం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఇంట్లోంచి బయటకు వెళ్లిన వృద్ధురాలి మృతదేహం లభించింది. ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. గడ్డపోతారం చెందిన సూరారం బాలమణి(60) ఈ నెల 14న ఇంట్లోంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు గ్రామంతో పాటు బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం గడ్డపోతారం శివారు 79సర్వే నెంబరులోని నీటి కుంటలో బాలమణి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. ఈ మేరకు పోలీసులకు సమాచారం అందించగా.. ఘటనా స్థలానికి చేరుకొని వారు బాలమణి శవాన్ని వెలికి తీసి పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అనిల్ హత్య కేసులో మరో నిందితుడు అరెస్ట్


నిందితుడని విలేకరుల ఎదుట ప్రవేశపెట్టిన పోలీసులు

మెదక్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎస్సీ సెల్ మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్ హత్య కేసులో మరో నిందితుడిని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. డీఎస్పీ ప్రసన్నకుమార్ రూరల్ సీఐ రాజేశేఖర్‌రెడ్డితో కలిసి నిందితుడి వివరాలను వెల్లడించారు. ఈ నెల 14న కొల్చారం మండలం వరిగుంతం సబ్‌స్టేషన్ సమీపంలో మారెల్లి అనిల్‌ను దారుణంగా కాల్చి చంపిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఏ-1 ముద్దాయిగా ఉన్న సోమన్నగారి రవీందర్‌రెడ్డితోపాటు నాగరాజు, నాగభూషణం, ఫరీద్, అశోక్‌లను సోమవారం అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. విజయవాడకు చెందిన షాబొద్దీన్, మరో నిందితుడు చిన్నా పరారీలో ఉన్నట్లు పోలీసులు ప్రకటించారు. అనిల్ కారులో ఉండగా, షాబొద్దీన్ కాల్పులు జరిపినట్లు పోలీసులు తెలిపారు. అతనిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయగా, మంగళవారం అతడినీ అరెస్ట్ చేశారు. ఈ కేసులో ఇప్పటి వరకు ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు అయింది.మరో నిందితుడు చిన్నాను కూడా త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

సంగారెడ్డిలో చైన్ స్నాచింగ్

● సీసీ కెమెరాలో రికార్డయిన దృశ్యాలు

సంగారెడ్డి క్రైం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి పట్టణంలోని అయ్యప్పకాలనీ రోడ్ నంబరు 1లో మంగళవారం సాయంత్రం చైన్ స్నాచింగ్ జరిగింది. పట్టణ సీఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం... అందోల్ మండలం డాకూరు గ్రామానికి చెందిన ఇందూరి నర్సింహులు సంగారెడ్డిలోని నీటిపారుదల శాఖ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తున్నాడు. సంగారెడ్డి పట్టణంలోని అయ్యప్పకాలనీ రోడ్ నంబరు 1లో రెండేళ్ల నుంచి భార్య ఇందూరి లక్ష్మి, కూతురుతో కలిసి నివాసముంటున్నారు. మంగళవారం సాయంత్రం 4.15 గంటలకు ఇందూరి లక్ష్మి తన కూతురును పాఠశాల నుంచి ఇంటికి తీసుకెళ్తున్న క్రమంలో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి లక్ష్మి మెడలో నుంచి బంగారు గొలుసు లాక్కొని పారిపోయారు. దుండగులు చైన్ స్నాచింగ్ చేస్తున్న దృశ్యాలు అక్కడి పరిసర ప్రాంతంలోని సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. బాధితురాలు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీ అయిన బంగారు గొలుసు మూడు తులాలు వుంటుందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ సీఐ రమేష్ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ


ధ్వంసమైన బీరువా

నంగునూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): నంగునూరు మండలం దర్గాపల్లి గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. రాజగోపాలపేట పోలీసుల కథనం ప్రకారం, దర్గాపల్లి గ్రామానికి చెందిన చాడ శ్రీనివాస్ రెడ్డి తన భార్యతో కలిసి ఈ నెల 21న హైదరాబాద్‌లోని తన కూతురు దగ్గరకు బోనాల పండుగకు ఇంటికి తాళం వేసి వెళ్లారు. గుర్తు తెలియని దొంగలు ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న 8 తులాల బంగారం, 12 తులాల వెండి, పట్టీలను ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. బాధితుడు శ్రీనివాస్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివేక్ తెలిపారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

మనోహరాబాద్, జూలై 22(ఆంధ్రజ్యోతి): మనోహరాబాద్ మండలం రంగయపల్లి గ్రామ శివారులో వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. రంగయపల్లి శివారులోని బొట్లగడ్డ వద్ద రైతుల పొలాల వద్ద ఏర్పాటు చేసిన వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులోని విలువైన కాపర్ కాయిల్స్, ఆయిల్ చోరీ చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం కావడంతో రైతులు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేశారు.

యూరియా పరిమితం

- వినియోగం తగ్గించేందుకు చర్యలు
- నానో యూరియాపై అవగాహన
- తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు

కొండపాక, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో యూరియా వినియోగాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకోసం యూరియా పంపిణీని సైతం పరిమితం చేసింది. యూరియా వినియోగం వల్ల నష్టాలేనని భావిస్తోన్న సర్కారు ఈసారి రైతు పట్టాదారు పాస్‌బుక్ ఆధారంగా ఎకరాకు ఒక బస్తా మాత్రమే పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటోంది. మరో పక్క నానో యూరియా వినియోగంపై విస్తృతంగా అవగాహన కల్పిస్తోంది. యూరియా కంటే నానో యూరియా వినియోగిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చునని చెబుతున్నారు.

ధరల భారం..

ప్రైవేట్ వ్యాపారులు యూరియా ధర పెంచి విక్రయిస్తున్నారు. ఆగ్రోస్ సేవా కేంద్రాల్లో యూరియా బస్తా ధర రూ. 280 ఉండగా, ప్రైవేట్ వ్యాపారులు రూ. 300లకు విక్రయిస్తున్నారు. డిమాండ్‌ను బట్టి ఈ ధర ఇంకా పెరుగుతోంది. ఇక నిబంధనల ప్రకారం రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తర్వాత ఆగ్రోస్ సేవా కేంద్రాల్లో, పీఏసీఎస్‌లలో ఎకరాకు ఒక బస్తా చొప్పున సాధారణ యూరియాను అందజేస్తున్నారు.

మోతాదుకు మించి వద్దు

యూరియా వినియోగంపై వ్యవసాయ అధికారులతో పాటు, వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. మోతాదుకు మించి యూరియా వినియోగించవద్దని చెబుతున్నారు. యూరియాలో ఉండే నత్రజని పంటకు ఎక్కువగా అవసరమని, అయితే, యూరియా పొలంలో వేసిన వెంటనే నీటిలో కరిగి భూమి పొరల్లోకి.. భూగర్భ జలాల్లోకి చేరి నష్టం జరుగుతోందని వివరిస్తున్నారు. కొంత గాలిలో కూడా ఆవిరైపోతుందని, ఇలా వృథాగా పోయిన తర్వాత కేవలం 30 నుంచి 35 శాతం యూరియా మాత్రమే పంటలకు అందుతుందని అంటున్నారు. ఇక యూరియా మోతాదుకు మించి వేయడం వల్ల మొక్కలు పెళుసుబారుతాయని, పురుగులను ఎక్కువగా ఆకిస్తాయని, రోగాలకు గురవుతాయని వివరిస్తున్నారు. యూరియాను ఒకేసారి కాకుండా తక్కువ మోతాదులో 3 నుంచి నాలుగు సార్లు వేసుకోవాలని సూచిస్తున్నారు. యూరియాతో పాటు భాస్వరం, పొటాష్ వంటి పోషకాలు కూడా పంటకు అవసరం ఉంటుందని, వీటి ధర ఎక్కువ కావడంతో రైతులు వీటి వినియోగానికి పెద్దగా మొగ్గు చూపకుండా, యూనియాను కుమ్మరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీని వల్ల నేల నిస్సారంగా మారడంతో పాటు పంటలు చీడపీడల బారిన పడి రైతుకు తగిన ఫలితం రావడం లేదని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

యూరియాకు ప్రత్యామ్నాయం

యూరియాకు ప్రత్యామ్నాయంగా మార్కెట్‌లో అనేక ఎరువులు అందుబాటులోకి వచ్చాయి. అందులో భాగమే నానో యూరియా. నానో డీఏపీ. వీటిని నీటిలో కలిపి పిచికారి చేయాలి. అలాగే, 19:19:19, 20:20:20, 52, 13-0-45 ద్రవరూప నత్రజని ఎరువు వంటివి అందుబాటులో ఉన్నాయి. దుక్కిలో సిఫారసుల మేరకు కాంప్లెక్స్ ఎరువులను వేసుకొని, పైరుపై పిచికారీ చేస్తే తక్కువ ఖర్చు, తక్కువ ఎరువుల నష్టంతో మంచి ఫలితాలు వస్తాయి. ఉదాహరణకు వరిలో పిలకలు పెట్టే దశలో నానో యూరియా, నానో డీఏపీ స్ప్రే చేసుకోవచ్చు. చిరుపొట్ట దశలో నానో యూరియా, 13-0-45 కలిపి స్ప్రే చేసుకుంటే తక్కువ ఖర్చులో మంచి ఫలితాలు వస్తాయి. పైరుపై స్ప్రే చేసే ఎరువుల వాడకం వలన చీడల సమస్య తగ్గుతుంది. రైతులకు శ్రమ, ఖర్చు తగ్గుతుంది. పంటలకు వివిధ దశలలో అవసరమైన పోషకాలు నేరుగా ఆకులకు అందించి అధిక దిగుబడులను పొందవచ్చు.



అర లీటర్ నానో.. ఒక బస్తాతో సమానం

యూరియా స్థానంలో నానో యూరియా వినియోగించాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ఈ మేరకు జిల్లాలో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. అర లీటరు నానో యూరియా డబ్బా ఒక యూరియా బస్తాతో సమానమని చెబుతున్నారు. నానో యూరియా వినియోగం వల్ల భూమి, నీరు, వాతావరణ కాలుష్యం రక్షించవచ్చునని, నానో యూరియా విరివిగా వినియోగించి పంటల దిగుబడి పెంచుకోవాలని సూచిస్తున్నారు.

పంటను బట్టి యూరియా వాడాలి



యూరియా వినియోగం అనేది పంటను బట్టి మారుతూ ఉంటుంది. వరి పంటకు యూరియాను బురద పదునులో వేయాలి. దీని వల్ల యూరియా నుంచి విడుదలైన అమ్మోనియా నేలకు అంటిపెట్టుకొని వేర్లకు అందుబాటులో ఉంటుంది. ఆరుతడి పైర్లకు యూరియా వేసినప్పుడు భూమిపైన కాకుండా మొక్కల దగ్గర గుంత తీసి అందులో వేసి మట్టితో కప్పివేయాలి. పెద్ద గుళికల యూరియాను వరి పైరుకు వేయడం వల్ల నత్రజని లభ్యత ఎక్కువ రోజులు ఉంటుంది. ఆరుతడి పంటలకు సన్నగుళికల యూరియా వేసుకోవడం వల్ల తేమ తక్కువగా ఉన్నప్పటికీ తొందరగా కరిగి మొక్కకు అందుతుంది. చౌడు నేలల్లో పండించే పంటలకు యూరియాను తక్కువ మోతాదులో ఎక్కువసార్లు వేయడంతో పాటు యూరియాను పిచికారీ చేయాలి. నానో యూరియా వంటి ఎరువులను వాడటం వల్ల పంటల్లో అధిక దిగుబడి సాధించవచ్చు.

-శివరామకృష్ణ మండల వ్యవసాయ శాఖ అధికారి



యూరియా కొరత సృష్టిస్తే పీడీ యాక్ట్

- మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్

శివ్వంపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో యూరియా కొరత లేదని, ఎవరైనా కొరత సృష్టించినా.. రైతులను తప్పుదారి పట్టించినా పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ హెచ్చరించారు. జిల్లాలో ఐదు వేల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని ఆయన చెప్పారు. మంగళవారం కలెక్టర్ మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి యూరియా స్టాక్, రిజిస్టర్లను పరిశీలించారు. ఇక్కడ వంద సంచుల యూరియా ఎక్కువ చూపించడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు యూరియా ఇవ్వకుండా పరిశ్రమలకు అక్రమంగా విక్రయించాలని చూస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు.

మీడియా కూడా..

వ్యవసాయ శాఖను సంప్రదించకుండా మీడియాలో యూరియా కొరత ఉన్నట్లు కథనాలు రాస్తే కూడా చట్టపరమైన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. జిల్లాలో కావాల్సిన దానికంటే ఎక్కువ యూరియా స్టాక్ ఉందన్నారు. వ్యవసాయ సహకార సంఘాలు, ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేయాల్సిందిగా వ్యవసాయ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ వెంకట్రాంరెడ్డి, ఏవో లావణ్య, సీఈవో మధు ఉన్నారు.

కాంగ్రెస్ పాలనలో రైతులకు అన్యాయం

- మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి
- పెద్దశంకరంపేటలో కరెంటు కోతలపై బీఆర్ఎస్ ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న నాయకులు, పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

పెద్దశంకరంపేట, జూలై 22(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు తీవ్ర అన్యాయం చేస్తుందని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం పెద్దశంకరంపేటలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ప్రధాన రహదారిపై బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కరెంటు కోతలకు నిరసనగా రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులను అన్ని విధాలుగా మోసం చేస్తున్నారని విమర్శించారు. కరెంటు ఎప్పుడు వస్తుందో, పోతుందో తెలియక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రైతులకు 24 గంటల నాణ్యమైన కరెంటు అందించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, మండల బీఆర్ఎస్ నాయకులు మాణిక్‌రెడ్డి, సురేశ్ గౌడ్, కన్నయ్య, రమేశ్, బూత్కూరు సుభాష్, యాదుల్, శంకరయ్య, కోనమంజయ, శంకర్‌గౌడ్, బొండ్ల దత్తు, బెజవాడ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

మట్టి టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్థులు



మట్టి టిప్పర్లు వెళ్లకుండా రోడ్డుపై అడ్డుగా నిల్చున్న గ్రామస్థులు

పాపన్నపేట, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఏడుపాయల్లోని కొల్చారం మండలం వైపు తమ వెంచర్‌ను చదును చేసుకోవడం కోసం ప్రైవేట్ వ్యక్తులు పదుల సంఖ్యలో టిప్పర్లలో మట్టిని తరలించడంతో నాగసానిపల్లి గ్రామంలోని అంతర్గత రోడ్లు, మిషన్ భగీరథ నీటి పైపులు పాడవుతున్నాయని ఆరోపిస్తూ గ్రామస్థులు మంగళవారం టిప్పర్లను అడ్డుకున్నారు. గత వారం రోజులుగా టిప్పర్లు తిరుగుతుండడంతో గ్రామంలోని రోడ్లు దెబ్బతింటున్నాయని గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. తహసీల్దార్ వచ్చేంతవరకు టిప్పర్లను వదిలిపెట్టమని పట్టుబట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, కలెక్టర్ అనుమతి ఉన్నందున టిప్పర్లు నడుస్తున్నాయని, అడ్డుకోవద్దని సూచించారు. రోడ్లు పాడవుతున్న విషయంపై తాము కూడా కలెక్టర్‌ను కలిసి తెలియజేస్తామని గ్రామస్థులు అన్నారు. పోలీసుల జోక్యంతో గ్రామస్థులు రోడ్డుపై నుంచి పక్కకు తప్పుకోవడంతో మట్టిని తరలిస్తున్న టిప్పర్లు యథావిధిగా నడిచాయి.

మెదక్ జిల్లాలో 84 మంది బాలలకు విముక్తి



సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

మెదక్ అర్బన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించి, బాలలు బడులకు వెళ్లే విధంగా ప్రోత్సహించాలని మెదక్ జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో వివిధ శాఖ సమన్వయంతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ ముఖ్యఅతిథిగా పాల్గొని, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో హోటళ్లు, ఇటుక బట్టీలు, నిర్మాణ పనులు, వ్యాపార సముదాయాల్లో పని చేస్తున్న బాల కార్మికులను గుర్తించి, వారిని తల్లిదండ్రులకు, సంరక్షణ కేంద్రాలకు తరలించి, యాజమానులపై చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్ కొనసాగుతుందన్నారు. 20 రోజుల్లో జిల్లావ్యాప్తంగా 84 మంది బాలలను రక్షించి, యాజమానులపై 50 కేసులు నమోదు చేశామన్నారు. బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను యూ ఆకారంలో కూర్చోబెట్టి పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు కమ్రొద్దీన్

బ్యాక్ బెంచర్స్ ఉండకూడదని..

లక్ష్మీనగర్ ప్రాథమిక పాఠశాలలో యూ సీటింగ్

కంది, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లోని తరగతి గదుల్లో బ్యాక్ బెంచ్‌లు యూ ఆకారంలోకి మారిపోయాయి. బ్యాక్ బెంచ్ స్టూడెంట్స్ ఉండకూడదనే ఉద్దేశంతో మంగళవారం కందిలోని లక్ష్మీనగర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులను యూ ఆకారంలో కూర్చోబెట్టి పాఠాలు బోధించారు. ఇటీవల కేరళలో విడుదలైన మళయాళీ సినిమా 'స్థానార్థి శ్రీకుట్టన్ క్లైమాక్స్ సీన్ స్ఫూర్తితో ఆ రాష్ట్రంలోని కొల్లం జిల్లాలోని రామవిలాపం ఒకేషనల్ హయ్యర్ సెకండరీ పాఠశాలలో అక్కడి విద్యాశాఖ ఈ విధానాన్ని ప్రారంభిచారు. ఇది సత్ఫలితాలను ఇస్తున్నట్లు అధికారులు గుర్తించారు. కేరళతోపాటు ఒడిశా, పంజాబ్, తమిళనాడు రాష్ట్రాల్లో యూ ఆకారం బోధనలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. యూ ఆకారం సీటింగ్‌తో విద్యా బోధన చేస్తే మెరుగైన ఫలితాలు రావొచ్చనే ఉద్దేశంతో జిల్లా ఉపాధ్యాయులు ఈ విధానాన్ని అవలంబిస్తున్నారు. దీంతో విద్యార్థుల్లో సమానత్వం, చదువు పట్ల ఆసక్తి పెంపొందించవచ్చని ఉపాధ్యాయులు ఆకాంక్షిస్తున్నారు.

'ఆర్టిజన్ల కన్వర్షన్‌తో ప్రభుత్వానికి ఆర్థిక భారం ఉండదు'



వంటావార్పులో ఆర్టిజన్ కార్మికులు

సంగారెడ్డి రూరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థలో పని చేస్తున్న ఆర్టిజన్ కార్మికులను కన్వర్షన్ చేయడం వల్ల ప్రభుత్వానికి గానీ, మేనేజ్‌మెంట్‌కు గానీ ఎలాంటి ఆర్థిక భారం ఉండదని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్ జేఏసీ రాష్ట్ర ఛైర్మన్ ఈశ్వర్ రావు స్పష్టం చేశారు. టీవీఏసీ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం సంగారెడ్డిలోని ట్రాన్స్‌కో ఎస్‌ఈ కార్యాలయం వద్ద ఆర్టిజన్ కార్మికులు వంటా వార్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వర్ రావు మాట్లాడుతూ, రాష్ట్రంలో పనిచేస్తున్న 19,600 మంది ఆర్టిజన్ కార్మికులను వారి విద్యార్హతలను బట్టి కన్వర్షన్ చేయాలని, అన్ని సంస్థల్లో ఒకే విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లు నెరవేరని పక్షంలో రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టేందుకు సమ్మె చేయడానికి కూడా వెనుకాడబోమని ఆయన హెచ్చరించారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు మాట్లాడుతూ, ఆర్టిజన్ కార్మికుల కన్వర్షన్ సాధన కోసం చేపట్టే పోరాటాలకు సీఐటీయూ పూర్తి స్థాయిలో మద్దతు ఇస్తుందని, భవిష్యత్తులో సమ్మెకు వెళ్లినా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జేఏసీ వైస్ ఛైర్మన్ నరేందర్, సిద్దిపేట, మెదక్ జిల్లాల ఛైర్మన్లు సుధాకర్, స్వామి, ప్రశాంత్, నాయకులు కనకరాజు, దుర్గేశం, మల్లేశం, జయపాల్, మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒకరోజు శాస్త్రవేత్తలుగా విద్యార్థులు



హైదరాబాద్‌లోని ఐఐసీటీలో ప్లాంట్ వద్ద ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

కంది, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : భారత ప్రధాని నరేంద్రమోదీ ఇటీవల మన్ కీ బాత్‌లో ప్రసంగిస్తూ విద్యార్థులు ప్రయోగశాలలో ఒక్కరోజు శాస్త్రవేత్తగా గడపాలని సూచించారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్)కు చెందిన పరిశోధక సంస్థ ఐఐసీటీ (ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ) 8,9,10వ తరగతుల విద్యార్థులకు అవకాశం కల్పించింది. అయితే కంది మండలం (ఓడిఫ్) ఆయుధ కర్మాగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 11 మంది ఈ అవకాశాన్ని పొందారు. వీరిని గైడ్ ఉపాధ్యాయుడు అడ్డాడ శ్రీనివాసరావు మంగళవారం హైదరాబాద్‌లోని ఐఐసీటీ సంస్థకు తీసుకువెళ్లారు. విద్యార్థులకు పరిశోధన వాతావరణాన్ని పరిచయం చేయడం, శాస్త్రవేత్తలతో చర్చించే అవకాశాన్ని కల్పించారు. క్విజ్ నిర్వహణ, వివిధ ప్లాంటుల సందర్శన మొదలైన కార్యక్రమాలలో విద్యార్థులు పాల్గొన్నారు. ఒకరోజు శాస్త్రవేత్తలుగా వ్యవహరించిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయంతి వాణి, ఇతర ఉపాధ్యాయులు రజిత, విజయభాస్కర్, రవీందర్, చవాన్ సుభాన్ సింగ్, సంధ్య, తల్లిదండ్రులు అభినందించారు.

సర్కారు బడిలో సొంత ఖర్చుతో 'నిఘా'


మున్సిపాలిటీ పరిధిలోని పోతిరెడ్డిపల్లి జడ్పీహెచ్ఎస్‌లో సొంత నిధులు రూ.లక్షతో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎంఈవో విద్యాసాగర్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. తరగతి గదులతో పాటు వరండా, పాఠశాల చుట్టూ పూర్తిగా కవరయ్యేలా 16 సీసీ కెమెరాలు బిగింపజేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల భద్రత దృష్ట్యా, సంఘ వ్యతిరేక కార్యకలాపాలు జరగకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.



ఉపాధి చూపేవారికే వేతనాల్లేవు

- మూడు నెలలుగా ఉపాధిహామీ సిబ్బంది ఎదురుచూపులు
- ఆర్థిక ఇబ్బందులతో సతమతం
- అమలుకు నోచుకోని పేస్కేల్ హామీ
- మెదక్ జిల్లాలో 408 మంది ఉద్యోగులు, సిబ్బంది

మెదక్ అర్బన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత ప్రజలకు స్థానికంగా ఉపాధి కల్పించేందుకు కేంద్రం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తున్నది. ఈ పథకంలో పనిచేసే ఉద్యోగులు, సిబ్బంది వేతనాల కోస నెలల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొన్నది. కాంట్రాక్టు విధానంలో పని చేస్తున్న ఏపీవోలకు పేస్కేల్ అమలు చేస్తామని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క 2 ఫిబ్రవరి 2024లో హామీ ఇచ్చారు. 17 నెలలు దాటినా మంత్రి హామీ అమలు కాలేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై జిల్లా అధికారులకు సమ్మె నోటీసును సైతం అందజేశారు.



వేతనాల కోసం డీఆర్డీవో శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇస్తున్న జేఏసీ నేతలు, ఉద్యోగులు, సిబ్బంది(ఫైల్)

సకాలంలో వేతనాలు రాక..

ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీలకు వంద రోజులపాటు పనులు కల్పించడంలో ఎఫ్ఏ(ఫీల్డ్ అసిస్టెంట్ల)లది పాత్ర కీలకం. కానీ వేతనాలు సకాలంలో రాకపోవడంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీరితోపాటు ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఇతర సిబ్బందికి సైతం నెలనెలా జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 67,413 కుటుంబాలు, 1,08,688 మంది కూలీలు ఉండగా, 17,86,048 పని దినాలు కల్పించారు.

408 మంది ఉద్యోగులు, సిబ్బంది..

జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి పర్యవేక్షణలో ఉపాధి హామీ పథకంలో ఎపీవో, ఈసీ, టీఏ, ఎఫ్ఏ, కంప్యూటర్ ఆపరేటర్లు, డీఆర్డీఏ కార్యాలయ సిబ్బంది మొత్తం 408 మంది పని చేస్తున్నారు. అందులో ఎఫ్ఏలు 250 మంది, టీఏలు 80, కంప్యూటర్ ఆపరేటర్లు 40, ఈసీలు 14, ఏపీవోలు 14, ఆఫీస్ సిబ్బంది 10 మంది ఉన్నారు. వీరంతా గ్రామాల్లో సంవత్సరానికి సరిపడా ఉపాధి పనులు గుర్తించి జాబ్ కార్డులు కలిగిన కూలీలకు పనులు కల్పిస్తున్నారు. టెక్నికల్ అసిస్టెంట్లు నూతనంగా గుర్తించిన పనులకు అంచనాలు వేయడం, పని ప్రదేశాల్లో కొలతులు వేడయం, రికార్డుల నిర్వహణ వంటి బాధ్యతలు నిర్వర్తిస్తారు. కంప్యూటర్ ఆపరేటర్లు ఆన్‌లైన్‌లో మస్టర్లు పొందుపర్చడం, ఎఫ్ఏలకు మస్టర్లు ఇవ్వడం, నిధులు జనరేట్ చేయడం, ఈసీలు, ఏపీవోలు ఉపాధి హామీ పనుల పర్యవేక్షణ బాధ్యతలు చూస్తారు.

నెలనెలా వేతనాలు అందించాలి



ఉపాధి హామీ పథకంలో పని చేస్తే ప్రతి ఒక్కరికి నెల నెలా వేతనాలు మంజూరు చేయాలి. మూడు, నాలుగు నెలలకోసారి జీతాలు ఇస్తుండడంతో కుటుంబ పోషణ భారంగా మారుతోంది. కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేసి, ఉద్యోగ భద్రత కల్పించి, పే స్కేల్‌ను వర్తింపచేయాలి.

-రాజ్‌కుమార్, జేఏసీ ఛైర్మన్ మెదక్

ప్రక్రియ కొనసాగుతోంది..

ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఉద్యోగులు, సిబ్బందికి వేతనాలు మూడు నెలలవి చెల్లించాల్సి ఉంది. బిల్లు చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. రెండు, మూడు రోజులుగా చెల్లించే ప్రక్రియ కొనసాగుతోంది.

- శ్రీనివాసరావు, డీఆర్డీవో మెదక్

సర్కారు వైద్యం.. అందని ద్రాక్ష

- గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలో 10 వేల మంది ప్రజలు, కార్మికులు ఉన్నా అందుబాటులో లేని ప్రభుత్వ వైద్యసేవలు
- వైద్యం కోసం పక్క మండలానికి వెళ్లాల్సిందే.. లేదంటే ప్రైవేట్ క్లినిక్‌లే దిక్కు
- కార్మికులకు ఈఎస్‌ఐ సౌకర్యం ఉన్నా డిస్పెన్సరీ లేక వైద్యసేవలకు దూరం
- ఆరోగ్య కేంద్రం లేదా బస్తీ దవాఖానా ఏర్పాటు చేయాలని వినతులు

జిన్నారం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలో పారిశ్రామికీకరణతో నానాటికి జనాభా పెరుగుతున్నా అందుకు అనుగుణంగా ప్రభుత్వ వైద్య సేవలు అందడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో ఆయా పరిశ్రమల కార్మికులతో పాటు స్థానిక గ్రామాల ప్రజలు నిత్యం ఇక్కట్లు తప్పడం లేదు. జిన్నారం మండలం గడ్డపోతారం మున్సిపాలిటీలో వేల సంఖ్యలో జనాభా, ఈఎస్‌ఐ కార్డుదారులు ఉన్నా.. కనీసం ప్రాథమిక వైద్యం అందని పరిస్థితి నెలకొన్నది. స్థానికంగా ఉన్న పరిశ్రమలలో పని చేసే కార్మికులు నిత్యం ఏదో చోట గాయపడటం, అనారోగ్యం బారిన పడుతున్న ఘటనలు జరుగుతున్నా, వారికి ప్రాథమిక చికిత్స కోసం నగరం వైపు పరిగెత్తాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలో 80 వరకు పరిశ్రమలు ఉండగా ఉపాధి కోసం వచ్చి స్థిరపడిన వారితో కలిసి 15 వేల జనాభా ఉంది. అదే విధంగా మున్సిపాలిటీ పరిధిలోని 4 పంచాయతీలకు వాటి పరిధిలోని గ్రామాలకు సమీపంలో పీహెచ్‌సీ సేవలు అందుబాటులో లేవు.

కాలుష్యం కాటు వేస్తున్నా..

ముఖ్యంగా పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన ఈ ప్రాంతంలో పరిశ్రమల జల, వాయు కాలుష్యంతో అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న ఇక్కడి ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రి సేవలు అందించాలనే డిమాండ్ ఉంది. నిత్యం వందలాది మంది ప్రాథమిక వైద్యం కోసం దూరంలో ఉన్న జిన్నారం పీహెచ్‌సీతో పాటు నగరంలోని పలు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తున్నారు. ఓవైపు దూరాభారం.. మరోవైపు వైద్య పరీక్షలు, చికిత్సలకు భారీగా డబ్బు ఖర్చు చేయాల్సి రావడంతో ప్రభుత్వం తమ ప్రాంతంలో పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

దూరాభారంతో ప్రైవేట్ క్లినిక్‌ల వైపు మొగ్గు

గడ్డపోతారం, అల్లీనగర్, లక్ష్మీపతిగూడెం, చౌదరిగూడెం, వావిలాల గ్రామాలు జిన్నారం మండలంలో ఉన్నా.. వైద్యసేవలు మాత్రం గుమ్మడిదల మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్నాయి. దీంతో అక్కడికి వైద్య సేవల కోసం వెళ్లాలంటే రంగారెడ్డి జిల్లా మీదుగా ప్రయాణం చేయాల్సి ఉండటంతో ఎవరూ అక్కడికి వెళ్లడం లేదు. ఈ గ్రామాల వైద్య సేవల పరిధిని జిన్నారం పీహెచ్‌సీ కిందకు చేర్చాలనే ప్రయత్నాలు సఫలం కాలేదు. మండల సభలో తీర్మానం చేసినా ఫలితం లేదు. దీంతో స్థానికులు ప్రైవేటు క్లీనిక్‌లనే ఆశ్రయిస్తున్నారు.



ప్రభుత్వ వైద్య సేవలకు నోచుకోని గడ్డపోతారం మున్సిపాలిటీ

ఈఎస్‌ఐ సౌకర్యం ఉన్నా..

స్థానిక పరిశ్రమలలో ఉన్న కార్మికులలో 7 వేల మంది వరకు ఈఎస్‌ఐ కార్డుదారులు ఉండగా వీరికి డిస్పెన్సరీ అందుబాటులో లేదు. నగరంలోని షాపూర్‌నగర్ లేదా గుమ్మడిదల ఈఎస్‌ఐ ప్రాంతీయ వైద్య కేంద్రాలకే వెళ్లాల్సిన పరిస్థితి నెలకొన్నది. కాగా గత ప్రభుత్వ హయాంలో బస్తీ దవాఖాన కోసం స్థానిక ప్రజా ప్రతినిధులు ప్రతిపాదనలు అందజేయగా నాటి మంత్రులు సానుకూలంగా స్పందించినా ప్రభుత్వం మారడంతో ఆ ప్రతిపాదనలు అమలుకు నోచుకోలేదు.

వైద్యసేవలు అందుబాటులోకి తేవాలి

మున్సిపాలిటీగా మారిన గడ్డపోతారం పరిధిలోని ప్రాంతాలకు ప్రభుత్వ వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలి. మున్సిపాలిటీలోని గడ్డపోతారం, వావిలాల, లక్ష్మీపతిగూడెం, పంచాయతీలు వాటి పరిధి గ్రామాలు పక్క మండలం గుమ్మడిదల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉండటం వల్ల వైద్య సేవలకు ఇబ్బందిగా మారింది. పీహెచ్‌సీ పరిధి మార్పునకు గతంలో మండల సభలో తీర్మానం చేసి కలెక్టర్‌కు పంపించినా ఫలితం లేదు. స్థానికంగా పీహెసీ లేదా బస్తీ దవాఖాన ఏర్పాటు చేసి పారిశ్రామిక ప్రాంత ప్రజలు, కార్మికులకు వైద్య సేవలు అందించాలి.

- రవీందర్‌గౌడ్, మాజీ ఎంపీపీ

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ అంతరాయం

సంగారెడ్డి అర్బన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి పట్టణంలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్ 1-ఏఈ సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని రాంనగర్, బ్రాహ్మణవాడ, నేతాజీ నగర్, మాధవనగర్, కట్టకొమ్ము, కిందిబజార్, శ్రీనగర్, మారుతినగర్, నలందానగర్ ప్రాంతాల్లో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన కేంద్రబృందం

చిలప్‌చెడ్, జులై 22 (ఆంధ్రజ్యోతి):మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించేందుకు కేంద్ర బృందం విచ్చేసినట్లు ఎంపీడీవో కలీముల్ల పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం చిలప్‌చెడ్ గ్రామ పంచాయతీని సందర్శించినట్లు తెలిపారు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు, ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్, స్వయం సహాయక బృందాల పనితీరు పరిశీలించారు. కార్యక్రమంలో కేంద్ర బృందం సభ్యులు సురేందర్‌రెడ్డి, సాధిక్‌అలీ, ఎంపీవో తిరుపతి, ఏపీవో శ్యాంకుమార్ , డిఈ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు

శ్రీశైలానికి ప్రత్యేక టూర్ ప్యాకేజీ

నారాయణఖేడ్, జూలై 22(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని ఖేడ్ నుంచి శ్రీశైలం ప్రత్యేక టూర్ ప్యాకేజీతో బస్సు నడుపుతున్నట్లు స్థానిక ఆర్టీసీ డీఎం మల్లేశయ్య తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బస్సులు ఈ నెల 27న ఉదయం 8 గంటలకు మంగల్‌పేట బస్టాండ్ నుంచి బయలుదేరి సాయంత్రం 6 గంటలకు శ్రీశైలం చేరుకుంటాయన్నారు. దర్శన అనంతరం అక్కడి నుంచి బయలు దేరి 28న రాత్రి 12 గంటలకు ఖేడ్‌కు చేరుకుంటాయన్నారు. మరిన్ని వివరాల కోసం 9959223170, 9441071134, 9063417297 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

నిజాంపేట, జులై 22(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో రాజిరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని నందగోకుల్ గ్రామాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించి పరిసరాలను పరిశీలించారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

రాయికోడ్, జూలై 22(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పని చేయాలని సంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రమైన రాయికోడ్‌లోని ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో మండలకాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ డీసీఎంఎస్ చైర్మన్ సిద్దన్నపాటిల్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాలాజీ నర్సింలు, నాయకులు ఉన్నారు.

మురుగు పైపులైన్ పనుల పరిశీలన

రామచంద్రాపురం టౌన్ జూలై 22 (ఆంధ్రజ్యోతి): కాలనీల్లో మురుగు సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ పుష్పానగేష్ అన్నారు. మంగళవారం రామచంద్రాపురం డివిజన్ పరిధి శ్రీనివాస్‌నగర్‌లో మురుగు పైపులైన్ పనులు పరిశీలించారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు బాధితులకు అప్పగింత

నిజాంపేట, జూలై 22(ఆంధ్రజ్యోతి): నిజాంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న 5 మొబైల్ ఫోన్లను మంగళవారం ఎస్‌ఐ రాజేష్ బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చోరీకి గురైన, పోగొట్టుకున్నసెల్‌ఫోన్ వివరాలను సీఈఐఆర్ వెబ్ సైట్‌లో నమోదు చేసి దరఖాస్తు చేసుకోవాలని బాధితులకు తెలిపారు.

నూతన ఐజీని కలిసిన ఎమ్మెల్యే



ఐజీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, జూలై 22(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర నూతన ఐజీగా నియమితులై బాధ్యతలు స్వీకరించిన తాఫ్సిర్ ఇక్బాల్‌ను మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

108లో మహిళ ప్రసవం

ఝరాసంగం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని రాంచెందర్ నాయక్ తండాలో సోమవారం అర్ధరాత్రి బానోత్ సుజాత అనే మహిళకు పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందజేశారు. వెంటనే 108 సిబ్బంది చేరుకుని ఆమెను ఝరాసంగం పీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గమధ్యంలో వాహనంలోనే ఆడశిశువుకు జన్మనిచ్చింది. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారని స్థానిక వైద్యాధికారి రమ్య తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



నర్సాపూర్ మున్సిపల్ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

నర్సాపూర్, జూలై 22(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల ప్రబలకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం నర్సాపూర్ మున్సిపాలిటీని పరిశీలించి మున్సిపల్ కమిషనర్ శ్రీరాంచరణ్‌రెడ్డితో పాటు ఇతర అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శానిటేషన్ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీటి నిల్వ ప్రదేశాలను గుర్తించి దోమల లార్వాలను నిర్మూలించడానికి ఆయిల్స్ బాల్స్ వేయాలన్నారు. కలెక్టర్ వెంట వ్యవసాయ సహకార సంఘం సీఈవో మధుతో పాటు పలువురు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ప్రాతినిధ్యం కల్పించాలి

పాపన్నపేట జూలై 22(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌లలో నామినేటెడ్ సభ్యులుగా దివ్యాంగులను నియమించాలని జాతీయ దివ్యాంగుల హక్కుల వేదిక మెదక్ జిల్లా అధ్యక్షుడు దేవయ్య విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన జిల్లా కలెక్టర్‌ను కలిసివినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్థానికసంస్థల ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం అవుతున్నందున తక్షణమే నిర్ణయం తీసుకుని స్థానిక సంస్థల్లో నామినేటెడ్ ద్వారా దివ్యాంగులను నియమించే విధంగా రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేయాలని కోరారు. వెంట జిల్లా ప్రధాన కార్యదర్శి నాసీర్. ఖాజా తదితరులు పాల్గొన్నారు..

రాత్రివేళలో చెట్ల నరికివేతను అడ్డుకున్న గ్రామస్థులు



రహదారి పక్కన ఉన్న చెట్లను నరికివేసిన దృశ్యం

అల్లాదుర్గం, జూలై 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఓ వైపు పచ్చదనాన్ని పెంచేందుకు లక్షలాది రూపాయలు వెచ్చించి మొక్కలను నాటుతుంటుంటే.. మరోవైపు కొందరు వివిధ కారణాలతో భారీ వృక్షాలను నరికివేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం రాత్రి మండలంలోని కాయిదంపల్లి గ్రామ శివారులో గ్రామస్థులు చెట్ల నరికివేతను అడ్డుకున్నారు. గ్రామస్థుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. అల్లాదుర్గం మండలంలోని కాయిదంపల్లి గ్రామ శివారులోని 161వ జాతీయ రహదారి పక్కన గల పాత రోడ్డు వద్ద ఉన్న మర్రి చెట్లను రాత్రి నరికివేస్తుండటంతో గ్రామ మాజీ సర్పంచ్ సంగమేశ్వర్‌తో పాటు గ్రామస్థులు సంఘటన స్థలానికి చేరుకొని అడ్డుకున్నారు. చెట్టు నరికివేస్తున్న వ్యక్తులతో కొంత సేపు వాగ్వాదం జరిగింది. సోలార్ విద్యుత్ తీగలకు అంతరాయం కలగడంతో తమ అధికారుల ఆదేశాలతో ఈ చెట్లను నరికివేస్తున్నామని తెలిపారు. ఈ చెట్ల నరివేతను పగలు చేపట్టాలేగానే రాత్రి వేళలో నరికివేయడం ఏమిటంటూ చెట్ల నరికివేతను గ్రామస్థులు అడ్డుకున్నారు.

భవిత కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

వెల్దుర్తి, జూలై 22(ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన భవిత కేంద్రాన్ని దివ్యాంగ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో యాదగిరి పేర్కొన్నారు. మంగళవారం వెల్దుర్తి ప్రాథమిక పాఠశాలలో భవిత కేంద్రాన్ని మెదక్ సీఎంవో రాజుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భవిత కేంద్రంలో మానసిక సమస్య, వినికిడి సమస్య, తక్కువ దృష్టి లోపం ఉన్నవారు, దివ్యాంగులకు ప్రత్యేక విద్యను అందిస్తారని తెలిపారు. పిల్లలకు కావాల్సిన ఫిజియోథెరపీ సౌకర్యం కల్పిస్తుమని తెలిపారు. అలాగే దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు రవాణా భత్యం కల్పిస్తామని వివరించారు. కార్యక్రమంలో వెల్దుర్తి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సాంబయ్య, ఉపాధ్యాయురాలు సృజన, ప్రత్యేక ఉపాధ్యాయుడు వరుణ్‌రెడ్డి పాల్గొన్నారు.

శిశుమందిర్‌కు పూర్వవిద్యార్థుల సహకారం



పాఠశాలకు బహూకరించిన బెంచీలతో పూర్వ విద్యార్థులు, పూర్వ ఆచార్యులు సుశీల

సంగారెడ్డి అర్బన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి భవానీమందిర్ సమీపంలోని శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాలకు పూర్వవిద్యార్థులు తమ వంతుగా సహకరించారు. పాఠశాల పూర్వ విద్యార్థులు నవీన్‌గౌడ్, మహేశ్‌చారి, రజనీకాంత్, వెంకటేశ్, రామకృష్ణ, శ్రీనివాస్, సంతోష్, ప్రవీణ్‌లు కలిసి సుమారు రూ.లక్షతో పాఠశాలకు 20 బెంచీలను పూర్వ ఆచార్యులు సుశీల చేతుల మీదుగా బెంచీలను పాఠశాలకు వితరణ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానాచార్యులు జగదీశ్వరి, పాఠశాల సమితి అధ్యక్షుడు కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి అంబరీష్, కోశాధికారి వెంకన్న, ప్రబంధకారిణి సమితి అధ్యక్షుడు రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి సమరసింహారెడ్డి, సభ్యులు ప్రహ్లాద్ పాల్గొన్నారు.

అట్టహాసంగా బోనాల పండుగ



రామాయంపేటలోని ఏడిదల ఎల్లమ్మకు బోనాలు

నారాయణఖేడ్/పటాన్‌చెరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ పట్టణంలోని సాయినగర్ కాలనీలోని ముత్యాల పోచమ్మ ఆలయంలో మంగళవారం బోనాల పండుగను వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి సతీమణి అనుపమారెడ్డి ముత్యాల పోచమ్మకు ఓడిబియ్యం సమర్పించారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేశారు. పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ప్రాంగణంలో పోచమ్మ ఆలయంలో బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాలలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

●నర్సాపూర్/రామాయంపేట/ తూప్రాన్: నర్సాపూర్ గౌడ సంఘం ఆధ్వర్యంలో నర్సాపూర్-సంగారెడ్డి మార్గంలో ఉన్న రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ అశోక్‌గౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు డి.అంజిగౌడ్, గౌడ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. ఏడీదుల ఎల్లమ్మ కాలనీలో బోనాల పండుగ అట్టహాసంగా సాగింది. మంగళవారం మహిళలు ఈ ఉత్సవ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. తూప్రాన్ పట్టణంలో శ్రీ ఉజ్జయిని మహంకాళి జాతర ఉత్సవాలలో మంగళవారం భౌరమ్మ పూజలు నిర్వహించారు. ఆదివారం నుంచి సాగుతున్న ఉత్సవాలు మంగళవారం భౌరమ్మ పూజలతో శ్రీ ఉజ్జయిని మహంకాళి జాతర ఉత్సవాలు ముగిశాయి.

'వడ్డీ'కాసురులు

(5వ పేజీ తరువాయి)

అవమానాలు, బెదిరింపులకు గురవాల్సి వస్తోంది. రుణం తీసుకునే సమయంలో ఖాళీ చెక్కులు తీసుకుని, వడ్డీ ఇవ్వక పోయినా చెక్ బౌన్స్ కేసులు వేస్తున్నారు వ్యాపారులు. ఇది మరింత ఒత్తిడికి దారి తీస్తోంది. ఇంట్లో భద్రత లేకపోవడం, పిల్లల భవిష్యత్తుపై బెంగతో కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఫైనాన్సర్ల బెదిరింపులు, ఒత్తిళ్లకు తలొగ్గకుండా చట్టపరంగా ఎదుర్కొనేలా బాధితులు ఆత్మస్థైర్యం కలిగిఉండాలని నిపుణులు పేర్కొంటున్నారు.

సేంద్రియసాగుతో అధిక దిగుబడులు

- మెదక్ జిల్లాలో రైతులకు అవగాహన



చిన్నశంకరంపేట: అంబాజీపేటలో పొలం వద్ద పంటల సాగుపై రైతులకు సూచనలు ఇస్తున్న డీఏవో

చిన్నశంకరంపేట/మనోహరాబాద్/టేక్మాల్/పాపన్నపేట/ రేగోడు/కొల్చారం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లావ్యాప్తంగా పలు మండలాల్లో వ్యవసాయ అధికారులు మంగళవారం పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. కొన్నిచోట్ల రైతువేదికల్లో సమావేశాలు ఏర్పాటు చేసి ఆధునిక పద్ధతిలో పంటల సాగుపై, మరికొన్నిచోట్ల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వరినాట్లు, ఆయిల్‌పామ్ తదితర పంటలసాగులో మెళకువలపై రైతు కూలీలకు, రైతులకు అవగాహన కల్పించారు. చిన్నశంకరంపేట మండలంలోని అంబాజీపేట గ్రామ శివారు వ్యవసాయ పొలాల్లో వరినాట్లను మంగళవారం మెదక్ జిల్లా వ్యవసాయాధికారి దేవకుమార్ పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సేంద్రియ ఎరువులతో పంటలు అధిక దిగుబడులు సాధించవచ్చని వివరించారు. పంటల సాగు కోసం జిల్లా వ్యాప్తంగా ఎరువులు సిద్ధంగా ఉన్నాయన్నారు. మనోహరాబాద్ మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమంలో మెదక్ జిల్లా నూతన వ్యవసాయ అధికారి దేవకుమార్, వ్యసాయ శాస్త్రవేత్తలు రైతులతో కలిసి ఆన్‌లైన్‌లో పత్తి, వరి, కంది, పంటల తెగుళ్ల నివారణపై అవగాహన సదస్సులో పాల్గొన్నారు. టేక్మాల్ మండల పరిధిలోని తంప్లూర్ గ్రామంలో డ్రోన్, నానో యూరియా వాడకంపై పెద్దశంకరంపేట ఏడీఏ రాంప్రసాద్ రైతులకు అయన అవగాహన కల్పించారు. రైతులు పురుగు మందుల పిచికారీకి డ్రోన్‌లను ఉపయోగించడంవల్ల తక్కువ సమయంలో ఎక్కువ పిచికారీ చేస్తుందన్నారు. దీంతో రసాయనల వినియోగం తగ్గడమే కాకుండా అధిక దిగుబడులు వస్తాయని తెలిపారు పాపన్నపేట మండలంలోని పొడిచ్చన్‌పల్లి రైతు వేదికలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో నాగ మాధురి రైతులకు మొక్కల పంపిణీ నుంచి ఎరువులు, డ్రిప్ పరికరాలు, అంతర పంటల సాగు వరకు ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తోందని వివరించారు. కార్యక్రమంలో ఆయిల్ పామ్ రిసోర్సెస్ కంపెనీ డైరెక్టర్ రంగ నాయకులు, ఏఈవో అభిలాష్, ఫీల్డ్ ఆఫీసర్ శంకర్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు. రేగోడు మండలంలోని టి లింగంపల్లి గ్రామంలో సాగు చేస్తున్న కూరగాయల పంటలను అల్లాదుర్గం, రేగోడు మండలాల హార్టికల్చర్ అధికారి సంతోష్ కుమార్ పరిశీలించి, రైతులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉల్లి పంట సాగు చేసే రైతులకు ఎకరాకు రూ.8 వేలు ప్రభుత్వం రాయితీ కల్పించిందని తెలిపారు. వీటితోపాటు కూరగాయల పంటలు పండించే రైతులకు రాయితీపై మొక్కలు అందిస్తున్నారని అన్నారు. ఉద్యాన శాఖకు సంబంధించిన వివరాల కోసం 8977714422 ఫోన్ చేసి తెలుసుకోవాలని చెప్పారు. కొల్చారం మండల పరిధిలోని రంగంపేటలో ఏవో శ్వేత క్షేత్రస్థాయిలో వరి పొలాలను పరిశీలించి తగిన సూచనలు చేశారు.

75 శాతం సబ్సిడీపై గడ్డి విత్తనాలు

నారాయణఖేడ్, జూలై 22(ఆంధ్రజ్యోతి): రైతులు, పశుపోషకులకు 75 శాతం సబ్సిడీపై గడ్డి విత్తనాలను పంపిణీ చేస్తున్నామని పశు సంవర్ధక శాఖ ఏడీ గంగాధర్ తెలిపారు. మంగళవారం ఖేడ్ పశువైద్యశాల ఆవరణలో రైతులు, పశు పోషకులకు సబ్సిడీ విత్తన బస్తాలను పంపిణీ చేశారు. పెంపుడు జంతువులకు పరీక్షలు చేయించుకొని చికిత్సలు చేయించాలని, వ్యాధులు సోకకుండా టీకాలను ఇప్పించాలన్నారు.

కేసుల దర్యాప్తులో వేగం పెంచాలి

- సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి క్రైం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి కేసులోనూ నాణ్యమైన దర్యాప్తు వేగవంతంగా పూర్తిచేయాలని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఆయన నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. అత్యాచార, పోక్సో కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయాలని, నిర్ణీత గడువులో దోషులను న్యాయస్థానం ముందుంచాలని ఆదేశించారు. లాంగ్ పెండింగ్ కేసుల ఛేదనకు ప్రత్యేక ప్రణాళికతో విచారణ చేయాలని పేర్కొన్నారు. అన్ని కేసుల్లో నేరస్తుల ఫింగర్ ప్రింటు తప్పనిసరిగా సేకరించి ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. ఆన్‌లైన్ మోసాలు, బెట్టింగ్ యాప్స్‌ను అరికట్టేందుకు పోలీసులు కృషి చేయాలని సూచించారు. డ్రగ్స్, మత్తు పదార్థాల నిర్మూలన కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడాలని నిర్దేశించారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల ప్రాధాన్యాన్ని ప్రజలకు వివరించి, ముఖ్యమైన ప్రదేశాల్లో ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలని ఆదేశించారు. అనంతరం ఎస్‌హెచ్‌వో వాహనాలను తనిఖీ చేశారు.

ఉద్యోగుల పనితీరుతోనే సంస్థల మనుగడ: ఎంవీఐ



ఆర్టీసీ ఉత్తమ ఉద్యోగులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న దృశ్యం

జహీరాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల పనితీరుపైనే ప్రభుత్వ ప్రైవేటురంగ సంస్థల మనుగడ ఆధారపడి ఉంటుందని జహీరాబాద్ ఎంవీఐ వెంకటయ్య, డిపోమేనేజర్ టి.స్వామి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ఆర్టీసీడిపోలో ప్రగతిచక్రాల పురస్కార అవార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వివిధఅంశాల్లో ప్రతిభను కనబర్చిన సిబ్బందికి నగదుతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్, గ్యారేజీ ఇన్‌చార్జి తిరుమలేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

29నుంచి రేషన్ కార్డుల పంపిణీ: ఎమ్మెల్యే



తహసీల్దార్లతో ఎమ్మెల్యే సమీక్ష

పటాన్‌చెరు/ రామచంద్రాపురం, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఈ నెల 29నుంచి పటాన్‌చెరు నియోజకవర్గంలో లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నట్టు ఎమ్మెల్యే గూడెంమహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. రేషన్ కార్డుల పంపిణీపై మండలాల తహసీల్దార్లతో క్యాంపు కార్యాలయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని గుమ్మడిదల, జిన్నారం, అమీన్‌పూర్, పటాన్‌చెరు, రామచంద్రాపురం మండలాల పరిధిలో మొత్తం 2,094 మందికి కార్డులు మంజూరయ్యాయన్నారు. ఈ నెల 29న పటాన్‌చెరు జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లను అందజేస్తామన్నారు. కాగా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరులో రూ. 2 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులను ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనులకు ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బి.రాములు గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కలను నెరవేర్చడమే ధ్యేయం

- నర్సాపూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి

మాసాయిపేట జూలై 22(ఆంధ్రజ్యోతి): నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి పేర్కొన్నారు మంగళవారం రాజిరెడ్డి మాసాయిపేట మండలంలోని నాగసానిపల్లి కొప్పులపల్లి బొమ్మారం మాసాయిపేట చెట్ల తిమ్మాయిపల్లి గ్రామాల్లో పర్యటించి ఇందిరమ్మ లబ్ధిదారులు నిర్మిస్తున్న ఇళ్లను పలు గ్రామాలలో తిరిగి పరిశీలించారు. కాగా నాగసానిపల్లి కొప్పులపల్లి గ్రామాల్లో పలువురికి ఆయన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కరుణాకర్ రెడ్డి శ్రీకాంత్ నాగిరెడ్డి కృష్ణారెడ్డి ముక్కు దశరథ మెకానిక్ శ్రీనివాస్ నాగరాజు డైరెక్టర్ నరసింహులు పాల్గొన్నారు.

పల్లెల్లో ప్రగతి పనులకు ఊపు



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఆత్మ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి, కాంగ్రెస్ నాయకులు

పుల్‌కల్, జూలై 22 ఆంధ్రజ్యోతి): ఎస్సీ సబ్ ప్లాన్ నిధులతో పల్లెల్లో ప్రగతి పనులు ఊపందుకోనున్నాయని జోగిపేట వ్యవసాయ డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ తిమ్మారెడ్డి మల్లారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నత్తి దశరత్ పేర్కొన్నారు. చౌటకూర్ మండలంలోని చక్రియాల గ్రామంలో మంగళవారం ఎస్సీ సబ్‌ప్లాన్ నిధుల కింద మంజూరైన రూ.10 లక్షలతో సిమెంటు రోడ్డు పనులను ప్రారంభించారు. మంత్రి దామోదర రాజనరసింహ సహకారంతో పల్లెల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం గ్రామానికి చెందిన తుంగె మల్లేశ్వరీ భర్త మల్లేశంకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈఈ శశికుమార్, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు చిన్నరోళ్లపాటి రాజశేఖర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వారాంతపు సంతలో అంగన్‌వాడీ మేళా



తూప్రాన్ వారాంతపు సంతలో అంగన్‌వాడీ మేళా

తూప్రాన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్‌లోని వారాంతపు సంతలో అంగన్‌వాడీ మేళా కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు ప్రీస్కూల్ విద్యార్థుల బోధనలకు ఉపయోగించే మెటీరియల్ ప్రదర్శించారు. 3-6 ఏళ్ల చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య కార్యక్రమాలు నేర్పించే విధానం గురించి తల్లి దండ్రులు, బాలింతలు, గర్భిణులకు అందించే సేవల గురించి మేళాలో వివరించారు. అంగన్‌వాడీ స్కూళ్ల ప్రాముఖ్యతను తెలియజేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శివకుమారి, మోహత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

సంగారెడ్డి రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తపాలాశాఖలో అధునాతన టెక్నాలజీకి అనుగుణంగా ఖాతాదారులకు మెరుగైన సేవలందించేందుకు శ్రీకారం చుట్టినట్టు డివిజనల్ పోస్టల్ సూరింటెండెంట్ శ్రీహరి తెలిపారు. సంగారెడ్డిలోని ప్రధాన తపాలా కార్యాలయంలో మంగళవారం నూతన సేవలను అయన ప్రారంభించిన మాట్లాడారు. డిజిటల్ సేవలను అందిపుచ్చుకని వాటిని ఖాతాదారుల ముంగిట్లో చేరవేయడమే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో సంగారెడ్డి సబ్ డివిజన్ ఏఎస్పీ సావిత్రి, హెడ్ క్వార్టర్ ఏఎస్పీ రఘువీర్, పోస్ట్ మాస్టర్ సాయిలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణాలు ఫోన్ పే ద్వారా చెల్లించుకోవచ్చు

మనోహరాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): శ్రీనిధి ద్వారా మహిళలు తీసుకున్న బ్యాంక్ రుణాలు ఫోన్ పే, గూగుల్ పే ద్వారా చెల్లించవచ్చని మెదక్ జిల్లా అదనపు డీఆర్డీవో సరస్వతి పేర్కొన్నారు. మనోహరాబాద్ మండల సమైక్య కార్యాలయంలో మంగళవారం మహిళా సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు డీఆర్డీవో మాట్లాడుతూ బ్యాంక్ లింకేజ్ క్యాష్‌లెస్ కార్యక్రమం గురించి మహిళలకు వివరించారు. ఇందుకోసం జిల్లాలో మొట్టమొదటిసారిగా మనోహరాబాద్ మండలాన్ని ఎంచుకున్నట్టు తెలిపారు.